## ఆకెళ్ళ రామచంద్రరావు




ఏ ఉదయం పదిగంటలవేళ బయటికొస్తే హైదరాబాద్ నగరం హడావుడిగా ఆటంబాంబు భయంతో ఎక్కడికో పారిపోతూన్నట్టుంటుంది.

హడావుడి.... హడావుడి... పరుగు పందెం... రేస్... మాడ్ రేస్...

అయితే బొంబాయిలాంటి మహానగరాన్ని దృష్టిలో పెట్టుకుని చూస్తే హైద్రా 'బాధ' కాస్త నయమేననిపిస్తుంది.

సుధాకర్ అప్పుడే బస్టాపు కొచ్చాడు. బస్సుకోసం చూస్తున్నాడు. ఎన్నో నిరీక్షణలలో మొదటిది మొదలైంది!

సిటీ సర్వీసు గురించి కథలుగా విన్నాడు, జోకులుగా ఆనందించాడు గతంలో సుధాకర్. ప్రస్తుతం ఉద్యోగరీత్యా ఇక్కడికి రావడంతో ఇవన్నీ చూస్తూ అనుభవించే అవకాశం వచ్చిందతనికి.

వాంటెడ్ కాలమ్స్‌లో అనుభవం అడుగుతుంటారు. అలా హైదరాబాద్ సిటీ సర్వీసుకి కూడా అది అవసరం. కొన్నాళ్ళు, కొన్నేళ్ళు పాటుపడి పాఠాలు నేర్చుకోవాలి. ఆనక ఆ పాఠాలను దృష్టిలో పెట్టుకుని మసులుతూండాలి.

ముందుగా నిరీక్షణ — పరమాత్మ కోసం జీవాత్మలా వేచి వుండటం అలవాటు చేసుకోవాలి. గంటలు... కొండొకచో — పూటలు (ఆశ్చర్యం లేదు) ఎదురు చూస్తూ కూర్చునే ఓర్పు కావాలి.

దీంతో అయిపోలేదు — బస్ వచ్చాక శక్తికొద్దీ పరిగెత్తాలి. ఈ పరుగు అలవాటు మీద సునాయాసంగా వస్తుంది. ఎందుకంటే సిటీ బస్సులకి స్టాపులో మాత్రమే ఆగకూడదనే నిబంధన వుంది కాబట్టి. మామూలుగా అవి స్టాపు ముందు, స్టాపు తర్వాత ఆగుతాయి.

జంటనగరాల ప్రజలకి ఎక్కువగా నడిచే అవసరం లేదు. అంచేత వ్యాయామం తక్కువై చాలా మంది లావైపోతున్నారు. తద్వారా ఆరోగ్యం దెబ్బ తింటోంది. అలా కాకుండా నగరపౌరులకి స్వల్ప ఎక్సర్‌సైజ్ కల్పించడానికి సిటీ బస్సులవారీ ప్రయత్నం చేస్తున్నారని ఊహ.

ఈ విషయం వదిలేస్తే — బస్సు వచ్చి ఆగిందనుకోండి — అభిమన్యుడిలా, బాలచంద్రుడిలా చొచ్చుకుపోగల నేర్పు కావాలి. తదుపరి భుజబలం చూపించాలి.

బస్సు ఎక్కే విషయంలో మంచీ మర్యాదా, జాలీ ఓలీ లాంటి వాటికి బొత్తిగా స్థానం లేదు. వృద్ధులైనా, కుంటి అవిటి అంధులైనా, ఆడవారైనా, బండెడు పుస్తకాలు, కాలేజీలో వెళ్ళే స్కూలు పిల్లలైనా సరే — తోసి పారేసి ముందుకు జొరబడాలి. ఎలాంటే — అడవి అంటుకుంటే జంతువులు పరిగెడతాయి చూడండి ఆ విధంగా లోపలికి జొరబడాలి. లేకపోతే ఇంతే సంగతులు.

ఇక బస్ లోపల ధైర్యే సాహసే ... సీటు. ఆక్రమించేసుకోవడమే... మరోమార్గం లేదు. దొమ్మి చేయాలి. వాగ్యుద్ధం, ముదిరితే ముష్టి యుద్ధానికి కూడా సర్వసన్నద్ధులమై వుండాలి.

ఒకానొకచో — హిమవత్పర్వత ప్రాంతమౌనుల వలె ఒంటి కాలి జపం చేయడానికి సిద్ధపడి వుండాలి. అంటే అదో రకమైన కొంగజపం లాటిది. ఈ సందర్భంలో దేశంలోని వివిధ నాట్య ప్రక్రియలు, గేమ్స్, స్పోర్ట్స్‌లో అనుభవం వున్నవారు ఈ కొంగజపాన్ని చాలా తేలికగా చేయగలరు.

ఒకోసారి గట్టిగా కూరేసిన పొట్టు పొయ్యిలో పొట్టు అణువుల్లా ఒదిగివుండేలా శరీరాన్ని సిద్ధం చేయడం మంచిది. ఓ అరగంటపాటు తక్కువ ప్రాణవాయువుతో వుండగలగడం అలవాటైతే శ్రేష్టం. మెడలు, కీళ్ళు, కాళ్ళు వేళ్ళు — సర్వాంగాలూ ఎలా పడితే అలా తిరగగలిగి వుండాలి.

మరో విషయం — ఎదుటి వ్యక్తి ఎలాంటివాడైనా చివరి సీనులో హీరోయిన్‌లా చటుక్కున వాటేసుకోగలగాలి?

కొన్ని నిముషాలు లేదా ఓ అరగంట పాటు — ఈ పాంచభౌతికమైన శరీరం నాది కాదనుకొని, ఆముష్మిక చింతనలో గడిపివేయగలిగితే మంచిది. అయితే ఈలోగా జేబు కొట్టేయకుండా కాస్త జేబు దృష్టి కూడా అవసరమనుకోండి!

అన్నిటినీ మించి కండక్టర్‌తో ఇచ్చి పుచ్చుకోడంలో ఎంతో విజ్ఞత కనపరచాలి. ఒకోసారి ఎంత వున్నా సమయానికి సరిపోక పోతే సుధాకర్‌లాగే ఇబ్బందులు పడాలి!

అప్పటికే పూటుగా నిండివున్న బస్ వచ్చి ఆగింది. సుధాకర్ నిలుచున్న స్టాపులో. సినిమా టిక్కెట్ల క్యూల్లో బ్లాక్‌వాళ్ళు జొరబడ్డట్టు ఎలాగో చోటు చేసుకుని. బస్సులో రెండు పాదాలూ మోపాడు సుధాకర్.

ఎవరో కాలు తొక్కుతున్నారు. మాసిన బట్టలతో ఓ వ్యక్తి సుధాకర్ ఇస్త్రీ బట్టలని ఢీ కొడుతున్నాడు. అయినా తప్పదు. అత్యవసరంగా పదిహేను నిముషాల్లో భౌతికంగా ఆఫీసులో వుండాలి? హైదరాబాద్ నగరంలో పదిగంటల వేళ అందరికీ యమర్జంటు పన్లే కదా!

సుధాకర్ ఉద్యోగరీత్యా హైదరాబాద్ వచ్చి రెండు నెలలే అయింది. ఇంకా అతను నగర దౌర్భాగ్యాలకి అలవాటు పడలేదు. మనుషులు అడవిజంతువుల్లా పరిగెత్తడం, అన్నిటిలోనూ అర్థం లేని వేగం, బస్సుల్లో ప్రాణాలకి తెగించి సర్కస్‌ఫీట్లు చేస్తూ ప్రయాణంచేయడం — 'ఎక్స్‌క్యూజ్‌మి' అంటూ బూటు కాళ్ళతో బరబరా అందరి కాళ్ళూ తొక్కేసి ముందుకు దూసుకుపోవడం లాంటివి తెలీవు. పొక్కా జేబులో ఫొటోతో పాటు పారిపోని పాత ఖైదీలా బస్ పాసు, నోట్లో కిళ్ళీ, భుజాన అన్నం కేరియర్ వున్న తోలుసంచీ లాంటివి అతనికి పనివడవు — పైగా చాలా విడ్డూరంగా వున్నాయి.

"టిక్కెట్... టిక్కెట్..." జనాన్ని తోస్తూ చోటు చేసుకుంటూ, భుజాలమీంచీ, చేతుల కింద నుంచీ చేయి చాస్తూ వచ్చాడు కండక్టర్.

"పారడైజ్ ఒకటి" అయిదు నోటు కండక్టర్ చేతిలో పెట్టాడు సుధాకర్.

ఫ్రరున టిక్కెట్ చింపి నాలుగున్నర వెనకాల రాసి సుధాకర్ చేతిలో పెట్టి వెళ్ళిపోయాడు కండక్టర్.

కండక్టర్ స్పీడునీ, లెక్కల్లో ప్రావీణ్యాన్ని మెచ్చుకుంటూ బస్సులో కాస్త ముందు కెళ్ళాడు సుధాకర్. అక్కడ కాస్త ఖాళీగా వుండడంతో హాయిగా వుంది సుధాకర్‌కి.

బస్ మెల్లిగా టాంక్‌బండ్ ఎక్కింది.

ఎలక్షన్‌ల ముందు ఓటర్ని వెతుక్కునే నాయకుడిలా చల్లగాలి బస్‌లో జొరబడింది.

ఎదురుగా ఓ అమ్మడు సుదీర్ఘ, సువిశాల చష్మాలతో జేడిపప్పు ఉప్మాలా సుధాకర్ కళ్ళబడింది!

ఉదయపు హుస్సేన్ (వినాయక్) సాగర్ పవనాలు ఆమె కురుల్ని అలవోకగా కదిలిస్తున్నాయి.

దాంతో సుధాకర్ మనసు కూడా దోలాయమానంగా తయారైంది. 'హాటె సిక్సీ బ్యూటీ' అనుకోకుండా వుండలేకపోయాడు.

ఈలోగా సుధాకర్‌కేసి మెరిసే కళ్ళతో రెండుసార్లు చూసిన ఆచష్మావాలీ నయనాభిరామంగా జేమ్స్‌స్ట్రీట్‌లో దిగిపోయింది.

ఒంగి చూసినా ఆ అమ్మడు గమ్యస్థానం ఏమిటో సుధాకర్‌కి తెలీదు.

**ఈ సభ్య సమాజంలో మనిషిని మనిషి పదినిమిషాల పాటైనా నమ్మకపోతే ఎలా? అసలు బతగ్గలమా ని?! అదీకాక అందరు కండక్టర్‌లూ ఒకేలా వుండరు కదా! బస్ మెల్లిగా జేమ్స్‌స్ట్రీట్ దాటి పారడైజ్ దగ్గరాగుతుందనగా...**

మరో అయిదునిముషాల్లో బయ్ బయ్ మంటూ బస్ పారడైజ్ దగ్గరాగింది.

"లా.. లలా... లాలాలలాలలా...." సుధాకర్ బస్సు దిగిపోయాడు. వేగంగా వెళ్ళిపోయింది బస్సు.

వాస్తవం నేలమీద కాలుపెట్టగానే చేతిలో బస్ టిక్కెట్. దాని మీద నాలుగున్నర — అశోకుడి శిలాశాసనంలా వెక్కిరించింది.

ఒక గాఢ నిట్టూర్పు — పళ్ళు పటపట — బలమైన కుడిచేతి పిడికిలి ఎడమ అరచేతికి మూడుసార్లు ఆనించుట— అసంకల్పితంగా జరిగిపోయాయి.

అసలే నెలాఖరు కావడంతో నాలుగున్నర రూపాయలైనా సుధాకర్ మీద ఆ వేళ ప్రభావం చూపించింది మరి!

* * *

ఈ మధ్య సుధాకర్ కండెక్టర్ దగ్గర చిల్లర విషయంలో జాగర్తగా వుండటం అలవాటు చేసుకున్నాడు.

బస్ ఎక్కే ముందు చిల్లర చూసుకోడం, లేకపోతే తీసుకుని మరీ ఎక్కడం, సరీగ్గా ఇచ్చి పుచ్చుకోవడం దినచర్యలో భాగంగా చేసుకున్నాడు ఘనత వహించిన భారతదేశంలో పరమ గుమస్తా అయిన సుధాకర్.

అయినప్పటికీ అన్ని వేళలూ మనవి కావుగా — దాంతోటే మరి వచ్చిన చిక్కల్లా?

ఓ రోజు — రద్దీగా వున్న బస్‌లో మామూలుగా ఎక్కేశాడు సుధాకర్. అలవాట్లో పొరపాటు చిల్లర విషయం చూసుకోలేదు.

"టిక్కెట్ ప్లీజ్..." అరుపుతో పాటు మనిషే వచ్చి పడ్డాడు. మరో ప్రయాణీకుడి భుజం మీంచి చెయ్యి చాచాడు.

సుధాకర్ గబుక్కున జేబులో చెయ్యి పెట్టాడు. పాము పిల్లలా పదినోటు బైటికొచ్చింది.

'హతోస్మి' అనుకుంటూనే ఇచ్చాడు. "పారడైజ్ ఒకటి" అన్నాడు.

యాభై పైసల ఖరీదు చేసే టిక్కెట్ సుధాకర్ చేతిలో పడింది.

"ఛేంజి నహీ హై బయి... అభీదేతూం... తూంతూం..." ముందుకెళ్ళిపోయాడు కండెక్టర్.

సుధాకర్‌కి మరి మాట్లాడే అవకాశంలేకపోయింది. పోన్లే... ఈ సభ్య సమాజంలో మనిషిని మనిషి పదినిముషాల పాటైనా నమ్మకపోతే ఎలా! అసలు బతగ్గలమాని?! అదీకాక అందరు కండెక్టర్‌లూ ఒకలా వుండరు కదా?

బస్ మెల్లిగా బోట్స్ క్లబ్, జేమ్స్ స్ట్రీట్, దాటి పాక్కుంటూ పారడైజ్ దగ్గరాగుతుందనగా సదరు కండెక్టర్ కోసం ఒళ్ళంతా కళ్ళు చేసుకుని ప్రియురాలిలా గాలించాడు బస్ అంతా.

డ్రయివర్ దగ్గర నుంచుని కిళ్ళీ వుమ్ముతూ, గార పళ్ళతో నవ్వుతూ ఉర్దులాంటి భాషలో పరాచకాలాడుతున్నాడు కండెక్టర్. చూశాడు సుధాకర్ అప్పుడు ఇటువైపు వచ్చేలా కూడా కనపళ్ళేదు.

మెల్లిగా దారి చేసుకుని కండెక్టర్ దగ్గరకెళ్ళాడు "ఛేంజి వ్వాలి" అన్నాడు.

ఆ మాట అనడంతోనే విదేశీ గూఢచారిని చూసినట్టు



చూశాడు. "నేనివ్వాల్నా!... టిక్కెట్ దిఖావో..." అన్నాడు.

"టిక్కెట్ మీద రాయలేదు. అభీ దేతూం... అన్నావు"

"నేనన్నానా!?.. గట్లా చెప్పనుబయి... పైసల్ ఇయ్యాల్నంటే ఎనక రాస్తా.. జూట్ మత్ బోల్నా..."

సుధాకర్ మొహం తెల్ల కాయితంలా అయిపోయింది.

"పైసల్ గట్టా ఇయ్యాల్నంటే టిక్కెట్ ఎనక రాయిపించుకోవాల. లేపోతే యాదుండదు..."

ఇక అక్కడుంటే అందరూ బుద్ధులు గరపుతారని భయం వేసింది. సొమ్మూ పోగొట్టుకుని ఈ నీతులు కూడా ఎవడు వినగల్డు!

ఆ ఊహ రాగానే – చటుక్కున బస్ దిగిపోయాడు. ఆ వేళ ఆఫీసులో అప్పారావు అవతారం ఎత్తేశాడు మరి!

* * *

నాటి నుంచీ సుధాకర్ జాగరూకత మరీ ఎక్కువైంది. నిజానికి సిటీ అన్నా, సిటీ బస్‌లన్నా, కండెక్టర్‌లన్నా, చిల్లరన్నా, ఓ రకమైన జుగుప్స ఏర్పడిందతనిలో.

అయినా తప్పదు. సిటీలో వుండకా తప్పదు – వున్నాక బయటికెళ్ళకా తప్పదు. వెళ్ళాక సిటీబస్ ఎక్కకా తప్పదు – ఆనక సమస్యలు, మామూలే.

ఓ రోజు పర్సనల్ పనిమీద సనత్‌నగర్ వెళ్ళాల్సొచ్చింది. పారడైజ్ దగ్గర బస్ పట్టుకున్నాడు.

ఆఫీసులు విడిచే టైము కాలేదు కాబట్టి బస్ కాస్త ఖాళీగానే వుంది. 'హమ్మయ్య' అనుకుని సీటు దొరకడం కూడా అదృష్టంగానే భావించాడు.

ఈలోగా బస్ మరో స్టేజీలో ఆగింది. బిలబిల్లాడుతూ జనం ఎక్కేశారు. బస్ వేగం పుంజుకుంది.

అదాట్న కండక్టర్ డ్యూటీ చెయ్యడం చూపిన సుధాకర్‌కి కళ్ళు తిరిగినంత పనైంది. దగ్గరిస్టాపుల వాళ్ళకి టిక్కెట్లు ఇవ్వడం లేదు. డబ్బులు మాత్రం నేరుగా వెళ్ళిపోతున్నాయి.

కొందరు ప్రయాణీకుల చేతుల్లోకి పాత టిక్కెట్లు వస్తున్నాయి. సుధాకర్ చేతిలోకి కూడా ఓ పాత టిక్కెట్ వచ్చింది.

అన్నా? ఏమి దురంతం? ఏం ధైర్యం! ప్రభుత్వం సొమ్ము జబర్దస్తీగా పలువురు ప్రయాణీకుల సమక్షంలో పైసలే కానివ్వండి – కూడితే రూపాయలు. ఫలహారం చేసైడమా? ఏమనాలో తెలీలేదు.

తోటి ప్రయాణీకులు కూడా ఎవరూ మాట్లాడ్డంలేదు.

బస్సు బేగంపేటని సమీపిస్తుండగా – కండెక్టర్ ఖంగు తిన్నాడు.

అటు నుంచీ – ఇటునుంచీ ఇద్దరు చెకింగ్ ఇన్‌స్పెక్టర్‌లు బస్సులో జొరబడ్డారు. కండెక్టర్‌కి కాళ్ళూ చేతులూ ఆడలేదు.

ఓ ఇన్‌స్పెక్టర్ కండెక్టర్‌ని పట్టుకున్నాడు. మరొకడు ప్రయాణీకుల టిక్కెట్లు తనిఖీ చేస్తున్నాడు.

కండెక్టర్ కి చెమటల్లు పట్టేశాయి?

మాటిమాటికీ ఏదో చెప్పాలని ప్రయత్నించి విఫలమవుతున్నాడు.

"నువ్వేం చెప్పొద్దు" అనేసి బరబరా రాసుకుపోతున్నాడు ఇన్‌స్పెక్టర్.

ఈలోగా మరో ఇన్‌స్పెక్టర్ సుధాకర్ దగ్గరకొచ్చి టిక్కెట్టు అడిగాడు.

సుధాకర్ ఇచ్చిన టిక్కెట్ అటూ ఇటూ తిప్పి చూశాడు.

ఠక్కున కండెక్టర్‌ని పిలిచాడు.

"ఏయ్... పైసలిచ్చావా!"

"లేద్సార్..."

"ముందు ఇచ్చేసెయ్..."

"అలాగేసార్?" అంటూ తొమ్మిదీ నలభై పైసలూ సుధాకర్ చేతిలో పెట్టాడు కండెక్టర్.

ఆశ్చర్యం నుంచి తేరుకునే లోగా సుధాకర్ చేతిలో డబ్బులున్నాయి.

నిజానికి టిక్కెట్ వెనకాల రాసున్న విషయం సుధాకర్ చూడనేలేదు – తీసుకోగానే జేబులో పెట్టుకున్నాడు.

బస్ నడక సాగించింది.

సుధాకర్ కండెక్టర్‌కి ఎక్కువ ఇవ్వలేదు మామూలుగా టిక్కెట్ డబ్బులు ఇచ్చాడు.

అయాచితంగా, అప్పనంగా వచ్చిన తొమ్మిది రూపాయల చిల్లర – చేతిలో బరువుగా వుంది సుధాకర్‌కి.

అతని మనసు గాలిలేని గదిలో దీపంలా స్తంభించింది.

అంతే – తర్వాతి స్టేజీలో చెకింగ్ ఇన్‌స్పెక్టర్‌లతో పాటు సుధాకర్ దిగిపోతూన్నప్పుడు కండెక్టర్ ముఖంలో రంగులు చూసి తీరాల్సిందే! *


వెరైటీకి పెట్టింది పేరు శ్రీ మహాలక్ష్మీ వారి నవలలు!
నావెల్టీకి చదవండి 5-3-85 న విడుదలయ్యాయి!!

మల్లాది వెంకట కృష్ణమూర్తి [ఆంధ్రజ్యోతి వీక్లీ సీరియల్]
రెండు రెళ్ళు ఆరు రూ 20/-

ఎన్.ఆర్.నంది...[ఆంధ్రజ్యోతి సీరియల్]
గుడ్‌బై భూదేవి గుడ్‌బై........రూ 20/-

వసుంధర....'రక్తపుటేర్లు'గా అపన సీరియల్
మల్లెలు-మందారాలు..........రూ 17/-

మాదిరెడ్డి సులోచన........శిక్ష........రూ 22/-

జి.భవానీకృష్ణమూర్తి....ఆంధ్రపత్రిక సీరియల్
అనురాగతరంగాలు............రూ 12/-

మల్లిక్ (పుస్తక రూపంలో ప్రప్రథమంగా 300కు పైగా)
మల్లిక్ కార్టూన్స్..............................రూ 15/-

డా॥ బి.జి.వి.నరసింహారావు
[ఆడవారి అందానికి అతి సులువైన మార్గాలు]
అతివలు-అందాలు..............రూ 15/-

* మల్లాది వెంకటకృష్ణమూర్తి రచనలు
చంటబ్బాయ్ [తృతీయ ముద్రణ]........రూ 25/-
ప్రేమిస్తే ఏమవుతుంది? [ద్వితీయ ముద్రణ] రూ 15/-
నత్తలొస్తున్నాయ్ జాగ్రత్త [ద్వితీయ ముద్రణ] రూ 20/-

* మీ దగ్గరలో వున్న పుస్తక విక్రేతను అడగండి
లేదా అడ్వాన్సు పంపుతూ మాకు వ్రాయండి!

శ్రీ మహాలక్ష్మీ బుక్ ఎంటర్‌ప్రైజెస్
మ్యూజియం రోడ్, గవర్నరుపేట, విజయవాడ-2, Ph: 63322

Bachi